మీరు కాదంటారు. మరి విజయగారి పుస్తకం మీకెలా వచ్చింది? పోనీ కారులో ఇష్టం లేకపోతే రిక్షాలో రండి'' అంటున్నారు ఇద్దరు యువకులు.

“నాకేం తెలియదయ్యా బాబూ. మాది ఈ ఊరే. రైల్లో దొరికింది ఈ పుస్తకం'' అంటున్నాడాయన.

నేను అటు చూశాను.

అతని చేతిలో విజయగారి కథల పుస్తకం.

నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

“ఎక్స్క్యూజ్ మి. నేను........'' అన్నాను.

“సారీ సర్'' అంటూ నన్ను వాళ్ళు తెచ్చిన కారు వేపు తీసుకువెళ్ళుతున్నారు, నేను కథల పుస్తకం చదువుతూ రైల్లో కునికిపాట్లు పడుతున్నప్పుడు కథల పుస్తకం జారిపోయి వుంటుందన్న విషయం, నా చేతిలో పుస్తకం వుంచుకోవాలన్న విషయం మర్చిపోయిన వైనం వాళ్ళకి చెప్తున్నాను. వాళ్ళు నవ్వుకుంటున్నారు.

—0—

# అదే పది వేలు

సాహితీ రంగంలో ఒక స్థాయికి వచ్చేవరకూ కష్టపడాలి. తరువాత ఎలా వ్రాసినా ఎలా చేసినా చెల్లుబడి అవుతుంది. బండి స్టార్ట్ కాకపోతే తోసేక ఆ బండి స్టార్టయ్యి నిరాటంకంగా కొనసాగినట్లే....

నేను కథ రచయితగా పత్రికారంగంలో స్థిరపడ్డాను. పైగా విశేషమేమంటే నేను ఇంతవరకు వ్రాసిన దాదాపు అన్ని కథలకు బహుమతులు రావడమే. అందునా అన్నీ ప్రథమ బహుమతులే. ఈ సంద

ర్భంలో పత్రికాధిపతులకు ఉత్తరాలు కూడా వచ్చేవట. ఈయనకు తప్ప మాకు ఇంకెవరికీ ప్రధమ బహుమతి ఇవ్వరా'' అని.

నిజం చెప్పాలంటే నేను వ్రాయడం మొదలు పెట్టిన కొత్తలో చాలా కష్టపడి వైవిధ్యంగల ఇతివృత్తంతో పత్రికలకు పోటీల కోసం ప్రత్యేకంగా వ్రాసి పంపేవాడినిగాని పోను పోను ఇది యాంత్రికమైపోయి ఏ కథ ఎలా వ్రాసినా బహుమతి రావడం ఖాయం అయిపోయింది.

''మళ్ళీ దీపావళి, సంక్రాంతి, ఉగాది కథలు పోటీలు వస్తున్నాయి. ఈసారి ప్రత్యేకంగా కూర్చుని, మంచి కథలు వ్రాసి పంపించాలి'' అనుకుంటూ ఆలోచిస్తున్నాను. ప్రతీ రచయితకూ తన రచన వెలుగు చూడటం సామాన్యుడికి విమానమెక్కినంత సంతోషం. అదే తన రచనకు ప్రధమ బహుమతి వచ్చిందనుకోండి అది ప్రతీసారి ప్రధమ బహుమతి పొందడం సామాన్యుడు రాకెట్‌లో చంద్రమండలం వెళ్ళినంత సంబరంగా వుంటుంది. ఈ సంబరపునేత్రావలో పయనిస్తూ ప్రస్తుతం ఆనందిస్తున్నాను.... ఇంతలో

'పోస్టు' అనే కేక వినపడింది.

సంతకం పెట్టి పోస్టుమేన్ దగ్గర కవరు తీసుకుని విప్పి చూశాను.

అందులో....

పదివేల రూపాయలకు డిమాండ్ డ్రాఫ్ట్ !

ఓహ్! ఇదేమిటి నేను ఇంత వరకూ అసలు పోటీలకు ప్రచురణకు కథలు పంపలేదే. కనీసం ఏ పత్రికలోనూ పరిశీలనలో లేవే, అనుకుంటూ డ్రాఫ్ట్ క్రింద జతపరిచిన ఉత్తరం తీశాను.

నమస్సుమాంజలి.

మేము పంపిన డిమాండ్ డ్రాఫ్ట్ చూసి మీరు ఆశ్చర్యపోయి వుంటారు.

మేమంతా వర్ధమాన రచయితలం. మేము ఎంతో కష్టపడి, వైవిధ్యంగల ఇతివృత్తాలతో చక్కని కథనం నుంచి ముగింపు సందేశాత్మకం కొస మెరుపువున్న కథలు వ్రాసి పత్రికలకు, పోటీలకు పంపితే మా కథలకు బహుమతి రావడంలేదు. మా కథలకు బహుమతి రాకపోవడానికి ముఖ్యకారణం మీరు. కథల పోటీకి కథలు పంపడం అనే విషయం మేము ఊహించాం.

మీకు ప్రతిసారీ బహుమతి వస్తుందని మాకు తెలుసు. ఎందుకంటే మీరు సాహితీపరంగా అలా స్థిరపడిపోయారు.

కాబట్టి మాయందు దయయుంచి వచ్చే కథల పోటీలకు మీరు కథలు పంపించవద్దని ప్రార్థిస్తున్నాము.

ఎలాగు మీకు ప్రథమ బహుమతి ఖాయం కాబట్టి పదివేల రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ పంపిస్తున్నాము, స్వీకరించండి. దయచేసి మాతో సహకరించండి.

ఇట్లు,
'వర్ధమాన రచయితలు'

ఉత్తరం క్రింద సంతకంలేదు.

"అయ్యా మా పత్రికకు సీరియల్ వ్రాయండి"

అని పత్రికలు....

"ఏవోయ్ పోటీలకు మంచి కథ వ్రాయి"

అని మిత్రులు, శ్రేయోభిలాషులు....

"మీకు బహుమతి వచ్చినందుకు శుభాకాంక్షలు"

అని అభిమానులు....

ఉత్తరాలు వ్రాసుకుంటారు.

కాని....

"ఇదేమిటి?"

ఇప్పుడు నేనేం చేయాలి?